# అరుణ కోరిక

ఎర్రాశెట్టి ఉ ఓబయ్య



**అరుణ రేడియో ఆఫ్ చేసింది.**

**'ముద్దబంతి పూవులో' అంటున్న ఘంటసాల గొంతు హఠాత్తుగా ఆగిపోయింది.**

'ఎంత మంచి మూడ్ పాడుచేశావు. నీకేం పిచ్చెక్కిందా ?' అన్నాను కుర్చీలో కూర్చునే.

'సైలెన్స్' అంటూ చూపుడువేలిని పెదాలపై వుంచి వరండావేపు చూడమని అరుణ సైగ చేసింది.

అప్పుడు తెలిసింది నాకు ఎదురింటి సుశీల కొన్న రేడియోగ్రామ్‌లో అదే పాట మరింత శ్రావ్యంగా వస్తోందని.

'మీరు కోరిన పాటలు' అయిపోయినట్లు రేడియోగ్రామ్ ప్రకటించింది.

కుర్చీలో కూర్చొన్న అరుణ 'ఏమండీ' అంది.

వాలకం చూస్తే ఏదో వంమడిగేట్టే వుంది. ఆమె కళ్ళలోకి సూటిగా, చిరాగ్గా చూశాను.

'మీ ఆఫీసులో పనిచేసే ఎల్. డి. సీ సుశీల రేడియోగ్రామ్ కొన్నదంటే ఆఫీసు మేనేజరీ చేస్తున్న మనమెందుకు కొనకూడదూ' అంది అరుణ ధీమాగా.

'ఫిక్సేషన్, ఎరియర్స్ రాగానే కొందాం. ఇప్పుడే ఏం తొందరొచ్చింది. అన్నట్టు ఇవాళ పది గంటలకు రామూ పెళ్ళి కదా. ఎనిమిది దాటుతోంది. తొందరగా బేబీ, బాబును ముస్తాబుచేసి చీరె మార్చుకో. వెళదాం. మనవాళ్ళంతా ఎదురు చూస్తుంటారు.' అన్నాను కనీసం టాపిక్కయినా మారుతుందని.

మేము కళ్యాణ మంటపం చేరేసరికే మిత్రుడు రామూ పెళ్ళిపీటలమీద కూర్చొన్నాడు. ఫ్యామిలీస్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జాగాలో మేము కూర్చొన్నాము.

'ఏమండీ పెళ్ళికూతురి వెనుక నిల్చొన్న మీ వదినగారిని చూశారా' అంది అరుణ.

అవునన్నట్లు తల వూపాను.

'ఆమెను కాదండీ, ఆమె మెడలోని నెక్లెస్ చూశారా అంటున్నా. ఎంత బావుంది. అలాంటి నెక్లెస్ నా కొకటి కొనిపెట్టకూడదూ' అంది అరుణ వినయంగా.

వినయంగా వరాలు అడగడం సవినయంగా వాటిని పుచ్చుకోవడం ఆమె అలవాటు. అడిగిన కోర్కె తీర్చకపోతే వదిలే స్వభావం ఆమెకులేదు.

'ఎరియర్స్ రానీ తెచ్చిపెడతాను' అన్నాను.

ఇకమీదట అరుణను పెళ్ళిళ్ళకు తీసుకెళ్ళే బుద్ధి తక్కువ పని చేయకూడదనుకొన్నాను.

మంగళసూత్ర ధారణ జరిగిపోయింది.

భోజనాలు ప్రారంభమయ్యాయి.

భోంచేసి అయినవారికీ, కాని వారికీ హాయ్, హాయ్ చెబుతూ పెళ్ళికొడుకు రామూకు గుడ్‌బై చెప్పి మా కుటుంబం నలుగురం రోడ్డునపడ్డాం.

అది గాంధీ రోడ్డు. ఇరువైపులా బ్రాందీ షాపులు. గాంధేయులు, బ్రాందేయులు ఖద్దరు దుస్తులతో దర్శన మిస్తున్నారు. మా బాబు, ఎనిమిదేళ్ళ కుర్రవాడు ముందు నడుస్తున్నాడు. నాలుగేళ్ళ బేబి నా వ్రేలు పట్టుకొని నడుస్తోంది.

పిల్లల సంగతి పట్టించుకోకుండా బట్టల దుకాణాలకేసి చూస్తూ నడుస్తోంది అరుణ.

సంఘం డ్రెసెస్ బోర్డు కనబడ్డంతోటే కన్ను కుట్టింది మా శ్రీమతికి. అలా జరుగుతుందని నాకు తెలుసు.

పదో, పాతికో తగలేసి ఆడాళ్ళనే బజారుకు పంపితే అదో దారి. కాని ప్రక్కన భర్తవుంటే మొత్తం బజారే కొనాలనిపిస్తుంది స్త్రీలకు. ఇక అరుణ కూడా అలాంటి ఆడదే, ఆమెకేం తక్కువ.

'ఏమండీ ! సంఘం డ్రెసెస్‌లోకెళ్ళి మన బేబీ కొక ఫ్రాక్ కొందామా' అంది అరుణ.

'ఎరియర్స్ రానీ' అన్నాను.

'ఏమిటండీ మీరు ప్రతి చిన్నదానికీ ఎరియర్స్‌తో ముడిపెడతారు. ఫ్రాక్ కొనడానికి వందలూ, వేలూ కావాలా' అంది అరుణ చులకనగా.

నాకు మనస్కరించకపోయినా క్లాత్‌షాపులోకి వెళ్ళక తప్పలేదు. అరుణ సెలెక్ట్ చేసిన ఫ్రాక్ ఖరీదు ఎనిమిది పదులని నాకు బిల్లిచ్చినపుడే తెలిసింది.

అదరిపడ్డాను.

'మన మరియదె ప్రాణమైన మగడెట్లయినన్' అన్న తిమ్మనార్యుని పారిజాతాపహరణ పద్య చరణాన్ని గుర్తు చేసుకొంటూ ఫ్రాక్ వద్దంటే అరుణ కోపపడుతుందని పర్సు తీసి ఎనిమిది పదులు కౌంటర్లో సమర్పించి ఫ్రాక్ పేక్ చేయించుకొని రోడ్డుమీది కొచ్చాము.

హారన్ కొడుతూ దూసుకుపోయేలా ముందు వచ్చే కారుని చూసి పిల్లలిద్దర్నీ పేవ్‌మెంటుమీదికి అప్రయత్నంగా నడిపించి 'హమ్మయ్య' అనుకొన్నాను.

వచ్చిన కారు కీచుమంటూ ఆనకట్టలో ఆగే ప్రవాహంలా మా ముందరే ఆగిపోయింది.

'హలో బ్రదర్' అన్నమాట విని తలెత్తి కారుకేసి చూశాను. స్టీరింగ్ చేతిలో పట్టుకొని కూర్చొన్న రాజా వెనక మేముండే వీధిలో వుండేవాడు.

'హలో రాజా, హౌ డు యూ డూ' అన్నాను ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

'కారెక్కండి. ఇంట్లో దిగబెడ్తాను' అన్నాడు రాజా.

నిజంగా నాకు కారెక్కాలని లేదు.

కారెక్కాలనే కోరిక అరుణకుందని తెలిసి వెనక సీట్లో నలుగురం హుందాగా కూర్చున్నాం.

'ఏం బ్రదర్ కారు కొన్నారా' అడిగాను.

'అవును బ్రదర్, నారం క్రితమే అయిదు వేలు అప్పు చేసి కొన్నాను. నాకు మేనేజర్ ప్రమోషన్ వచ్చినప్పటినుండి కారు కొనాలని మా ఆవిడ ఒకటే గోల చేసింది. శ్రీమతి కోరిందంటే కొనక తప్పుతుందా.'

రాజా మాటలు నా గుండెల్లో సూదుల్లా గ్రుచ్చుకొన్నాయి. అరుణ కసలే ఇతరులతో పోటీపడే స్వభావమెక్కువ. పోనీ కారు కొందామంటే వచ్చే జీతంలో సగం పెట్రోలుకు సరిపోతుంది. ఈ పరిస్థితినుండి కాపాడమని ఏడుకొండలవాడిని వేడుకొన్నాను.

అయినా ఫలితం శూన్యం.

ఏడుకొండలవాడు ఏ స్త్రీ మనసులోనయినా పరకాయ ప్రవేశం చేయగలడేమో కాని మా అరుణ ఛాయలకైనా రావాలని ప్రయత్నించడు.

అంత మొండి పట్టుదల ఆమెది.

ఆలోచనలలో మునిగి తేలుతూన్న నేను, కారు

మా ఇంటి ముంగిట ఆగటంతో ఈ లోకాని కొచ్చాను. కాని పరధ్యానం పూర్తిగా వదలలేదు.

రాజుకు థాంక్స్ చెప్పి ఇంట్లోకి నడిచాము ఇంటిల్లిపాదీ.

'ఏమండీ' అంది అరుణ వాకిట్లోకి అడుగు పెడుతూ.

'ఇక్కడేం మండీ లేదే. బెల్లమండీ వెనకాలే వెళ్ళింది' అన్నాను పరధ్యానంగా.

'నేనడిగేది మండీ కాదండీ, రాజా కారు సంగతి. రాజా భార్య ఎంత అదృష్టవంతురాలండీ. తాను చెప్పగానే రాజు కారు కొనేశాడు. నేను మీకు ఎన్నోసార్లు చెప్పాను. అప్పు చేసయినా కారు కొనండీ అని. మీరు కొన్నారా. నిజం చెప్పాలంటే మీరు నా మాటకు విలువే ఇవ్వరు' అంది అరుణ స్టాండుకు చేతిలోని వేనిటీ బ్యాగ్ తగిలిస్తూ.

'మొత్తం విలువంతా నీకే ఇస్తూంటే, నీ మాట కెక్కడ మిగిలుందే ఇవ్వటానికి' అన్నాను చిలిపిగా చూస్తూ.

పంటితో క్రింది పెదవి నదిమిపట్టి ఓరచూపు చూసి మూతి ముడుచుకొంది అరుణ.

* * *

ఆ వేళ మొదటి తారీఖు. వడ్డీ వ్యాపారులు ఉద్యోగుల ఇండ్లు దర్శించే రోజు. సిటీలోని సినిమా హాల్సు హౌస్‌ఫుల్ బోర్డు తప్పకుండా తగిలించుకొనే రోజు. నేను ఆఫీసులో వేల కొలది డబ్బులు బట్వాడా చేసే రోజు. జీతం పుచ్చుకొన్న నా జేబు బరువు ఫీలయి బజారు కెళ్ళమంది. తిన్నగా వెళ్ళి హీరాస్ సిల్క్ ప్యాలెస్‌లో ఒక షిఫాన్ జార్జెట్ చీర కొన్నాను.

అరుణను అలంకరించి కొత్త చీరెలో ఆమె అందం చూడాలనిపించింది.

టాక్సీ ఎక్కాను.

కలల రథం ఎక్కినట్లనిపించింది.

ఇవాళ అరుణ చీరె చూడగానే సంతోష పడుతుంది. రాత్రంతా కబుర్లతో నన్ను గిలిగింతలు పెడుతుంది. నా ఒడిలో పసిపిల్లలా ఒదిగిపోతుంది.

# అరుణ కోరిక

టాక్సీ ఆగింది. కలల రథం దిగి యదార్థ లోకాని కొచ్చాను. టాక్సీకి డబ్బులిచ్చి ఇంట్లోకి నడిచాను.

చీరె పేక్ చేసిన కవరు అరుణ చేతికిచ్చి, బాత్‌రూంలో ముఖం కడుక్కొని, అక్కడే కొక్కేనికి తగిలించిన తువ్వాలులో తుడుచుకొంటూ వచ్చి హాల్లోని కుర్చీలో కూర్చున్నాను.

'ఏమండీ' అంది అరుణ– చీరె కవరులోంచి తీసి టేబుల్‌మీద వుంచుతూ.

ఇవాళ నన్ను అమాంతంగా పొగిడేస్తుందను కొన్నాను. 'చీర బావుంది కదా' అన్నాను.

'అది సరే కానీండి. ఇవాళ మధ్యాహ్నం మీ అమ్మగారు మన ఇంటికొచ్చి వెళ్ళారు' అంది అరుణ సంతోషాన్ని వెలిబుచ్చుతూ.

పెళ్ళయి వేరు కాపురం పెట్టిన పదేళ్ళకు మా అమ్మగారికి కరుణ కలిగిందంటే పుత్రుడుగా నేను సంతోషించాను.

'అరుణా! అమ్మగారు ఏం మాట్లాడారు. మనిల్లు బావుందన్నారా.'

'అబ్బే అదేం కాదండీ. ఇలాంటి ఇల్లు మీరెందుకు కొనకూడదూ' అన్నారు.

'ఎరియర్స్ రానీ' అందామనుకొని గొంతులో వెలక్కాయ పడ్డట్లు ఆగిపోయాను. ఇల్లు కొనడ మంటే మాటలా! అది ఎరియర్స్‌తో సరిపడేది కాదు కాబట్టి మౌనంగా వుండిపోయాను.

మా అమ్మగారికంటే అరుణకే ఇల్లు కొనాలనే కోరిక ఎక్కువగా వుందని నాకు అర్థమయింది.

రాత్రి పదయింది. పాత పత్రిక తిరగేస్తున్న నేను అరుణకేసి చూశాను.

ఆమె మంచంపై ఇద్దరి పిల్లలమధ్యా ఆదమరచి నిదురబోతోంది.

ఆమె ముఖం చంద్రబింబం.

ఆమె కోరికలు చంద్రునిలోని మచ్చలు.

నాలో ఉవ్వెత్తుగా లేస్తున్న ప్రశ్నల పొదలు.

నేను నిజంగా అరుణ కోర్కెలు తీర్చలేని అసమర్థుణ్ణయిపోయాను. ఆమె మనస్తత్వానికి నాకూ రాజీ కుదరడం అసాధ్యం.

విడాకులిచ్చి పీడ విరగడ చేసుకోవడమే సబబు అనిపించింది.

తెల్లవార్లూ ఏవేవో ఆలోచనలు.

తెల్లారింది. నిదురపోని నా కళ్ళు ఎర్రబడ్డాయి. లేచి గెడ్డం గీసుకొంటున్నాను.

స్నానం, పూజ ముగించుకొన్న అరుణ కాఫీ తెచ్చి టేబుల్‌మీద పెట్టింది.

'అరుణా' అన్నాను కర్కశంగా. అలా మాట్లాడ్డం నాకదే మొదటిసారి.

అదిరిపడిన అరుణ 'ఏమండీ' అంది నాజూగ్గా.

'నీ ప్రవర్తన నాకేం నచ్చడంలేదు. ఎందరితోనో పోటీ పెట్టి నా అసమర్థతను నిరూపించావు. తల్లిదండ్రులను కాదని నిన్ను పెళ్ళి చేసుకొని నేనెంత పొరబాటు చేశానో ఇప్పుడు తెలుస్తోంది. రేడియోగ్రామ్, నెక్లెస్, కారు, స్వంత యిల్లు సంపాదించి పెట్టే తాహతు నాకు లేదు. నేను పదుగురితో పోటీ పడలేను. పేదరికంలో పెరిగిన నాకు అల్ట్రామాడర్న్ సుఖా లంటే అసహ్యము.

నీ ఆశయాలు నెరవేర్చలేని భర్తగా నీతో కాపురం చేయడం కంటే విడాకులు తీసుకోవడమే ఉత్తమం. ఇవాళే లాయరు దగ్గరికెళ్దాం' అన్నాను.

అరుణ గలగలా నవ్వింది.

నా ఒంటిమీద పాములు ప్రాకినట్లయింది.

ఆమె అసహ్యించుకొంటుందనుకొన్నాను. కోప పడుతుందనుకొన్నాను. అవేమీ లేకపోగా నవ్వుతూ దగ్గరకొచ్చి నా తల నిమిరింది.

'మీరు పెళ్ళయిన కొత్తలో నెలకు రెండు వందలు సంపాదించేవారు. ఇప్పుడు రెండు వేలు సంపాదిస్తున్నారు. ఒకే గది గల ఇంట్లో ప్రారంభ మయిన మన బ్రతుకు బంగళాకు చేరింది.

ఇవన్నీ ఎలా జరిగాయంటారు. మీ హోదా ఎలా పెరిగిందంటారు. నేను మిమ్మలను పోటీలో నిలబెడుతూ వుండబట్టే.

పెద్దలు ఇష్టపడని పెళ్ళి జేసుకొని మనిద్దరం వారికి దూరంగా బ్రతుకుతున్నా, మన హోదా పెరిగి కన్నవారిని దగ్గరకు రప్పిస్తుందని కలలు కన్నాను. ఇల్లూ, కారూ గల గొప్ప వ్యక్తిగా మా నాన్నగారి లాంటి హోదాలో మిమ్మలను చూడాలని మురిసిపోయాను.

'విడాకులిస్తా అరుణా' అని ఎంత ఈజీగా అనగలిగారు.

'పెళ్ళి పవిత్రమైనది. అంతకంటే ప్రేమ పవిత్రమైనది. రెండూ కలిసి పెనవేసిన పవిత్ర బంధం మనది. ఆ బంధాన్నే త్రుంచివేయాలని మీరు నిర్ణయించుకొంటే నేను జీవితంతో పూర్తిగా ఓడిపోయినట్లే. మీ ఇష్టప్రకారమే కానీండి. నడవండి లాయరు దగ్గరికి' అంది అరుణ కన్నీళ్ళు రెప్పల చివర్లో నిలుపుతూ.

నా కళ్ళు చెమ్మగిల్లాయి.

మా ఇరువురి బుగ్గలపై కన్నీళ్ళు తుడవ డానికి ప్రయత్నిస్తున్నారు బాబు, బేబీ.

## మాటలు! మాటలు!

ఏది చదివినా, ఎక్కడ విన్నా ఇవేళ
అర్థాల కెన్నడో విడాకులిచ్చి, వట్టి
అనర్థాలై, మిడి మిడి కురుకుతున్న
మాటలు! మాటలు! మాటలు! మాటలు!

ఐశ్వర్య దుర్మదాంధుల ముత్యాల 'జాలరుల'
బంగారు పల్లకీలై,
అధికార గర్వోన్మత్తుల సముత్తుంగ
బలవత్తురంగమ వాహనాలై
చెంగు చెంగున చెంగలిస్తూ
మున్ముందుకు దూసుకుపోతున్న
మాటలు! మాటలు! మాటలు! మాటలు!

దిక్కు మొక్కులేక అల్లల్లాడిపోతున్న
దీనాతి దీనుల కుత్తుక అదిమిపట్టిన
ఉరితాళ్ళయి, గాటంగా బిగుసుకుపోతున్న
మాటలు! మాటలు! మాటలు! మాటలు!

ప్రజానీకం బహువిధాల జీవితరంగాలమీద
బూటకాల నాటకాల ఆటలతో, పాటలతో,
విషంతో మేళవించిన విపరీత వ్యామోహ
మద్యపానీయాల హుషారుల నిషాలతో
మత్తెక్కించి మైమరపిస్తున్న
మాటలు! మాటలు! మాటలు! మాటలు!

వీడలయి, ఎడతెగని పీడలయి, చిచ్చుల
పిడుగులయి, మాటిమాటికి అదేపనిగా
నలువైపుల చెలరేగి నర్తిస్తున్న
మాటలు! మాటలు! మాటలు! మాటలు!

— పిలకా గణపతిశాస్త్రి